సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని, పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ ఎంపీ స్థానంలో అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రాజయ్య మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు అనుభవించి కారు గుర్తుపై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ తనను హైదరాబాద్‌కు పిలిపించుకుని మాట్లాడారని, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారని రాజయ్య తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారని వివరించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

శ్రీహరివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు..

బీఆర్‌ఎస్‌లో ఎన్నో పదవులు అనుభవించిన కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తారని రాజయ్య విమర్శించారు. శ్రీహరి సామాజికవర్గ జనాభా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సుమారు 600 మంది ఉంటారని, ఓట్లు 429 ఉంటాయని తెలిపారు. నియోజకవర్గంలోని జనాభాలో మాదిగలు 35 శాతం ఉన్నప్పటికీ కడియం శ్రీహరి కూతురు కావ్యకు ఎంపీ టికెట్‌ను పొందిన తర్వాత అవకాశవాదంతో కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పార్లమెంటు సీట్లలో మూడు ఎస్సీలకు రిజర్వు చేసినా వీటిలో ఒక్క సీటు కూడా మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించలేదన్నారు. మాదిగలను కాంగ్రెస్ పార్టీ అవమాన పరిచిందని, ఈ ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, ధర్మసాగర్, జఫర్‌గఢ్ మండలాల పార్టీ అధ్యక్షులు మాచర్ల గణేశ్, వారాల రమేశ్, జయపాల్ రెడ్డి, ఎం రాజు, కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అక్కనపల్లి బాలరాజు, మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటికొండ సురేశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ పొన్న రంజిత్, నాయకులు లకావత్ చిరంజీవి, కనకం గణేశ్, కుంభం కుమార్, గొడుగు సంజీవ, ఒగ్గు రాజు, గాదె రాజు, మారెపల్లి ప్రసాద్, ఆకారపు అశోక్, మునిగల రాజు, అక్కనపల్లి రాకేశ్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడిన కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా
- వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం

దేవరుప్పుల, ఏప్రిల్ 15: కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. స్థానిక అనంతరామ రైస్ మిల్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ఆవరణలో ఆరబోసేందుకు వసతి కల్పించాలని, తాలుపట్టే యంత్రాల ను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే మిల్లుకు తరలించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను షేక్‌రిజ్వాన్‌బాషా ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే రైతులకు టార్పాలిన్లు అందించాలన్నారు.

దేవరుప్పుల : రైస్‌మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

సీఎమ్మార్ లక్ష్యాన్ని మిల్లర్లు పూర్తి చేయాలి..

రాష్ట్ర ప్రభుత్వానికి బియ్యం కోటాను సకాలం రైస్‌మిల్లర్లు పంపాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా కోరారు. ధాన్యం లోడ్ రాగానే అన్లోడ్ చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన పాఠశాలల్లో వేసవి పూర్తయేనాటికి వసతులు కల్పించాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీతారాంపురం, దేవరుప్పుల బస్టాండ్ ప్రాంత ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులను, చదువులో విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం తహసిల్, ఎంపీడీవో కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మొగులప్ప, డీఏస్‌వో రోజారాణి, డీసీవో రాజేందర్, డీపీఎం రాజేందర్, డీఈవో రాము,తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ మండల విద్యా ప్రత్యేకాధికారి ఉపేందర్, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో కృష్ణమూర్తి, ఆర్ఐ రాజు, అనంతరామ రైస్ మిల్ యజమాని బుక్క సత్యనారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ గోలి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రోహిత్ సింగ్

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్ ఘన్‌పూర్: ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం మండలంలోని శివునిపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరికరంతో పర్యవేక్షించారు. రోహిత్‌సింగ్ మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వారీగా తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఎం కడారి కుమారస్వామి, కేంద్రం ఇన్‌చార్జి ఉమ, బుక్ కీపర్ లావణ్య, కమిటీ సభ్యులు ఉపేంద్ర, యాదలక్ష్మి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలి : సీపీఐ

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 15 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ధాన్యం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి తోట రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, హమాలీల కొరత ఉందని, అవసరమైన మేరకు లారీలను సమకూర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సముద్రాల రాజు, రైతులు జీడి ఆశీర్వాదం, బుచ్చయ్య, నర్సయ్య, రమేశ్, గట్టయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 15 : మండలంలోని అన్ని గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల్లోని మొక్కలు, చెట్లు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రఘురామకృష్ణ సూచించారు. సోమవారం ఆయన బసిరెడ్డిపల్లి గ్రామ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు మొక్కలకు నీళ్లు పట్టాలన్నారు. వర్షాలు పడేవరకూ మొక్కలను పరిరక్షించాలని ఆయన కోరారు.

రేపు సీతారాముల కల్యాణం

బచ్చన్నపేట, ఏప్రిల్ 15 : శ్రీరామనవమి పురస్కరించుకుని మండల కేంద్రంలో శివభక్త మార్కేండేయ స్వామి ఆలయంలో ఈ నెల 17న ఉదయం 11.30 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగుతుందని ఆలయ పూజారి గణపురం ఆనంద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం 6 గంటలకు ఆలయంలో మహాగణపతి పూజ, శివ పార్వతులకు, భక్త మార్కేండేయ స్వామికి , పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకాలు జరుగుతాయని ఆయన వివరించారు. అనంతరం శ్రీకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని ఆనంద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం ఉంటుందని వెల్లడించారు. వేడుకలకు భక్తులు తరలిరావాల ని కోరారు.

మార్మోగిన హనుమాన్ సంకీర్తన

రఘునాథపల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని శ్రీ మహదేవ స్వామి ఆలయం సోమవారం హనుమాన్ నామ సంకీర్తనతో మార్మోగింది. స్థానికులు కొల్పుల నాగరాజు, కిశోర్ హనుమాన్ దీక్ష చేస్తున్న భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి పిండిపోలు శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పాటిస్తే దోషాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్.ఎంపీటీసీ పేర్ని ఉషారవి, జర్నలిస్టులు చింతకింది కృష్ణమూర్తి, కొలుపుల రవి, హనుమాన్ భక్తులు సందీప్, అనిల్, సతీశ్, రాజు, మహేందర్, మరాఠి శ్రీశైలం, సూర్యతేజ పాలొన్నారు.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సులేమాన్

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 15 : రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల పరిపాలన అధికారుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జనగామలోని ఏబీవీ డిగ్రీ కళాశాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మహ్మద్ సులేమాన్ అహ్మద్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని నాంపల్లి రూసా బిల్డింగ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు మహ్మద్ సులేమాన్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్ రామ్ కిషన్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జేవీఎస్ లక్ష్మి, ఉపాధ్యక్షులుగా నవీన్, మాధవి, కోశాధికారిగా సీహెచ్ అరవింద్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సులేమాన్ అహ్మద్‌కు ఏబీవీ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో పాటు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో కారోబార్ మృతి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తీగారం గ్రామానికి చెందిన కారోబార్ పోగు అయోధ్య రాములు(48) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. అయోధ్య రాములు ఉదయం పాలకుర్తి బస్టాండ్ సమీపంలోకి రాగా ఛాతీలో నొప్పి వచ్చింది. గమనించిన స్థానికులు బాధితుడిని స్థానిక దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 20 ఏళ్లుగా కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అయోధ్య రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు కుమారస్వామి, కారోబార్ల సంఘం బాధ్యులు కోరారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తీవ్రంగా గాయపడిన భిక్షపతి

రఘునాథపల్లి ఏప్రిల్ 15: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మాధారంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధారానికి చెందిన గీత కార్మికుడు బుర్గు భిక్షపతి వృత్తిలో భాగంగా సోమవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు భిక్షపతికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సీఎండీ మనుమడు మృతి

హనుమకొండ, ఏప్రిల్ 15 : ఎన్‌పీడీసీఎల్ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు మనుమడు, హనుమకొండ సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు కుమారుడు మేఘాంశ్ ఆదివారం రాత్రి హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డుపై జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మేఘాంశ్ మహీంద్రా యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని సోమవారం విద్యుత్‌నగర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు పలువురు తమ సంతాపం తెలిపారు.

అంబాలలో రేషన్ బియ్యం పట్టివేత

కమలాపూర్ : మండలంలోని అంబాల గ్రామంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్, బోయిని అయిలుస్వామి ఇండ్లల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం వచ్చింది. ఎస్ఐ వీరభద్రరావు, సిబ్బంది వెంకటరమణ, మోహన్‌తో కలిసి ఇండ్లలో తనిఖీ చేసి 30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు చెప్పారు. శ్రీనివాస్, అయిలుస్వామిని అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు.

మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్, 15: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతూ ఓట్ల రాజకీయం చేస్తున్నదని పరకాల ఎమ్మెల్యే, కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రేవూరి మాట్లాడుతూ శ్రీరాముడి పేరుతో ఓట్లను పొందేందుకు బీజేపీ కుటిలయత్నాలకు పాల్పడుతున్నదన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, విభజన చట్టంలోని హామీలను నెరవేర్చలేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య. వరంగల్ నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కత్తి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వేణుమాధవ్

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 15 : విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టీ వేణుమాధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం జనగామ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు కరెంట్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణుమాధవ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీనియర్ ఉద్యోగుల అనుభవాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈఈలు లక్ష్మీనారాయణ రెడ్డి, విజయ్‌కుమార్, మర్రెడ్డి, ఇన్‌చార్జి డీఈటీ ప్రభావతి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జయరాజు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మేకలు

విద్యుదాఘాతంతో మేకలు, దూడ మృతి

బచ్చన్నపేట, ఏప్రిల్ 15 : మండలంలోని కట్కూర్‌లో విద్యుత్‌షాక్‌తో మేకలు, దూడ మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్కూర్‌కు చెందిన బోయిని కనుకయ్య వ్యవసాయ బావి వద్ద ఉన్న సర్వీసు వైరు సోమవారం తెగి రేకుల షెడ్‌పై పడింది. దీంతో షాక్ కొట్టి షెడ్‌లోని దూడ, ఎనిమిది మేకలు మృతి చెందాయి. ఈ ఘటనతో రూ.1.50 లక్షల నష్టం జరిగిందని బాధితుడు కనకయ్య బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

నేడు బీఆర్‌ఎస్ శ్రేణులతో సమీక్ష

హాజరుకానున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, క్రియాశీలక సభ్యులు, ప్రజాప్రతినిధులతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండలాధ్యక్షుడు తీగల దయాకర్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక తిరుమల గార్డెన్‌లో బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామాల వారీగా బూత్ లెవల్లో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం, ప్రజలకు చెప్పాల్సిన అంశాలను శ్రేణులకు వివరిస్తారన్నారు. మంగళవారం ఉదయం రామరాజుపల్లి, నీర్మాల, సింగరాజుపల్లి, పెదమడూరు, చినమడూరు, అప్పిరెడ్డిపల్లి, కోలుకొండ, చౌడూరు, మధ్యాహ్నం పెదతండా, మాధాపురం, కడవెండి, సీతారాంపురం,ధర్మగడ్డ, ధరావత్ తండా,ధర్మాపురం గ్రామాల సమావేశం ఉంటుంది. సాయంత్రం మన్‌పహాడ్, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల గ్రామాల నాయకులతో సమీక్ష ఉంటుందని దయాకర్ వెల్లడించారు.

నిట్‌లో ఈ-ఆఫీస్ ఫైల్ సిస్టం ప్రారంభం

మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 15 : నిట్‌లో ఈ-ఆఫీస్ ఫైల్ సిస్టంను అమలు చేస్తున్నట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. సోమవారం నిట్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఉమామహేశ్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ సెంటర్ హెడ్ రష్మీ రంజన్‌రౌత్ సమక్షంలో ఈ-ఆఫీస్‌ను ఆయన ప్రారంభించారు. రైల్ టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జాయింట్ జనరల్ మేనేజర్ విక్రాంత్‌కుమార్, సీనియర్ మేనేజర్ ఎంఎస్ స్నేహ త్రిపాఠి హాజరయ్యారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15 : పాత కక్షలు మనసులో పెట్టుకొని వ్యక్తిని గొడ్డలితో నరికి చంపిన నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. మడికొండ శివారు రాంపేటకు చెందిన దడబోయిన శంకర్‌కు అలుపుల సమ్మయ్యకు మధ్య పాత కక్షలు ఉండేవి. సమ్మయ్య ప్రతిరోజు వాకింగ్ వెళ్లే సమయంలో అక్కడే ఓ బండపై పడుకుని కళ్లు మూసుకుని యోగాసనాలు చేసే విషయం గమనించాడు. ఈ నేపథ్యంలో 2021 జూలై 10వ తేదీ ఉదయం 6:30 గంటల సమయంలో సమ్మయ్య యోగ నిద్రలో ఉన్న సమయంలో గొడ్డలితో దాడి చేసి పారిపోయారు. అతడి కుటుంబ సభ్యులు మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మామునూరు సీఐ రవికుమార్ నిందితుడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. సరైన సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ. ఐదు వేల జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్ వాదించారు, కోర్టు లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రమేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

దేవరుప్పులలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సీఐ

దేవరుప్పుల, ఏప్రిల్ 15: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై సీఆర్‌పీఎఫ్ పోలీసులు వాహనాలను ఆపి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాల్లో రూ.50 వేలకు మించి కనిపిస్తే డబ్బులకు సంబంధించిన పత్రాలు ఉండాలని, లేకుంటే నగదు సీజ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాలించాలని, ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, వాహన చోదకుడికి డ్రైవింగ్ లైసెన్స్, టూవీలర్ వాహనదారుకు హెల్మెట్ ఉండాలన్నారు. కారులో కూర్చున్న వారు సీట్ బెల్ట్ విధిగా పెట్టుకోవాలన్నారు. వాహనాలకు వెనకా, ముందు నంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల ఎస్సై చెన్నకేశవులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ప్లాట్లు అమ్మబడును

★వరంగల్ ట్రైసిటికి హైవేలను ఆనుకొని ఉన్న మా వెంచర్లలో ప్లాట్లు తక్కువ ధరలలో అమ్మబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 9701396797.
NTW-323041

WANTED

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

రైళ్లలో నుంచి పడి ఇద్దరి మృతి

కాజీపేట, ఏప్రిల్ 15 : కాజీపేట-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఇద్దరు ప్రయాణికులు వేర్వేరు రైళ్లల్లో నుంచి జారి పడి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాకు చెందిన అరుణ్ (21) ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారి పడి మృతిచెందాడు. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ (25) సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు కాగజ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. హసన్‌పర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని జాగీర్ గ్రామ శివారులో రైల్లో నుంచి జారిపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఫిరోజ్‌ను ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుల వద్ద దొరికిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు రైల్వే పోసులు తెలిపారు.

వ్యక్తికి రూ.50వేల జరిమానా

పరకాల, ఏప్రిల్ 15 : నిబంధనలు అతిక్రమించి గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తికి రూ.50వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ పేర్కొన్నారు. గీసుకొండ మండలం జాన్‌పీరీలుకు చెందిన భూక్యా కొమ్మాలు గుడుంబాను విక్రయిస్తుండడగా ఎక్సైజ్ అధికారులు పట్టుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినా అతడు గుడుంబా విక్రయిస్తూ మళ్లీ పట్టుపడ్డాడు. దీంతో తహసీల్దార్ జరిమానా విధించారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు

నర్మెట, ఏప్రిల్ 15 : గ్రామాల్లోని బెల్టు షాపులను మూసివేస్తామని ఎన్నికలకు ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు దీని అమలుపై పట్టనట్లు వ్యవహరిస్తున్నదని విమర్శలొస్తున్నాయి. బెల్టు షాపుల మూలంగా అనేక మంది మద్యానికి బానిసై అనారోగ్యానికి గురవడంతోపాటు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు నెలకొని మద్యానికి బానిసైన ఓ యువకుడు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పొద్దంతా కష్టపడి సంపాదించిన మొత్తాన్ని రైతులు, కూలీలు బెల్టుషాపులకు తగలేస్తున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో 24 గంటలు మద్యం విక్రయాలు కొనసాగుతున్నా మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

క్వార్టర్‌కు రూ.40, బీరుకు రూ.50 అదనం

ఎమ్మార్పీ రేటుకు మద్యం విక్రయాలు జరగడంలేదని విమర్శలొస్తున్నాయి. బెల్టు షాపులకు ఒక్కో బ్రాండ్‌ను బట్టి క్వార్టర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు అదనంగా వైన్స్ షాపు యజమానులు తీసుకుంటున్నారు. మరోవైపు బెల్టు షాపు నిర్వాహకులు దీనికి రెట్టింపుగా క్వార్టర్‌కు రూ.40 నుంచి 50, బీరుకు రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు.

బెల్టు షాపులకు అనుమతి లేదు..

బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలకు అనుమతి లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. బెల్టు షాపులు ని ర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తప్పవు.

- జనార్దన్, ఎక్సైజ్ ఎస్సై

పలు షాపులపై కేసులు నమోదు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు కొనసాగిస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో పలు బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేశాం. నిర్వాహకులను బైండోవర్ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్‌యాదవ్, ఎస్సై